క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

మొయినాబాద్: మండల పరిధిలోని అజీజ్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని మండల విద్యుత్ ఏఈ బానోతు హమునాయక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అజీజ్‌నగర్, నాగిరెడ్డిగూడ, శ్రీనిధి స్కూల్, గండిపేట రోడ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ పనుల వల్ల విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

సీఎంఆర్ఎఫ్ ఎల్‌ఓసీ అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే

కొందుర్గు: మండలంలోని విశ్వనాథ్‌పూర్ గ్రామానికి చెందిన ఎద్దు అస్మిత అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఈ సందర్భంగా విశ్వనాథ్‌పూర్ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి ఎద్దు అస్మిత అనారోగ్యం పరిస్థితిని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌కు వివరించారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ అస్మిత చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్ పథకం కింద ఒక లక్ష రూపాయలు మంజూరు చేయించారు. సోమవారం ఆమె కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణారెడ్డి, లక్ష్మణ్ నాయక్, శేఖర్, శ్రీనివాసురెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, బాలాంజనేయులు, ధర్మయ్య, యాదయ్య పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

ఎంపీపీ రవీందర్ యాదవ్

కేశంపేట: బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని ఎంపీపీ రవీందర్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కల్లేపల్లి శేఖర్ ఆదివారం మృతి చెందడంతో గ్రామ బీఆర్ఎస్ నాయకులతో పాటు ఎంపీపీ రవీందర్‌యాదవ్ సోమవారం మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం ఐదు వేల ఆర్థిక సహాయం ఆయన అందజేశారు. కార్యకర్తలతో పాటు వారి కుటుంబ సభ్యులకు పార్టీ ఎల్లవేళల అండుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శేఖర్‌పంతులు పాల్గొన్నారు.

మండలానికి చేరిన రంజాన్ తోఫాలు

కేశంపేట: ప్రభుత్వం ముస్లింలకు రంజాన్ పండుగ సందర్భంగా అందజేస్తున్న రంజాన్‌తోఫాలు మండలంలోని తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ముస్లిం సోదరులకు 300 జతల తోఫాలను ప్రభుత్వం అందించిందని తహసీల్దార్ మురళీకృష్ణ అన్నారు. త్వరలోనే గ్రామాల్లోని ముస్లింలకు మండల కేంద్రంలో కార్యక్రమం ఏర్పాటు చేసి అందిస్తామని ఆయన తెలిపారు.

ఫార్మేషన్ రోడ్డు పనులు ప్రారంభం

దోమ: గ్రామాల్లోని రైతులు ఉపాధి హామీ పనులను వినియోగించుకోవాలని సర్పంచ్ తారీబాయ్, ఎంపీటీసీ సభ్యుడు రాములు తెలిపారు. మండల పరిధిలోని బొంపల్లి తండాలో రైతులు పొలాలకు వెళ్లే ఫార్మేషన్ రోడ్డు పనులను సోమవారం ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు పొలాలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతుండడంతో ఈ పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, గ్రామస్తులు మాన్య, శంకర్‌నాయక్, గోపాల్, రైతులు, కూలీలు పాల్గొన్నారు.

ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

ఎస్ఎస్ఏ సంఘం అధ్యక్షురాలు దేవి



ఎస్ఎస్ఏ నూతన కమిటీ సభ్యులు

కుల్కచర్ల: సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల హక్కులను కాపాడేందుకు నిర్విరామంగా కృషి చేస్తామని సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షురాలు దేవి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నూతనంగా సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షురాలిగా దేవి, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మయ్య, సమన్వయకర్తగా కృష్ణయ్య, ప్రచార కార్యదర్శిగా చెన్నయ్య, ఉపాధ్యక్షురాలిగా సువర్ణ, సలహాదారుడిగా రాములును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలు మాట్లాడుతూ.. కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న తమను క్రమబద్ధీకరించే వరకు పోరాడుతామన్నారు.

అభివృద్ధికే అధిక ప్రాధాన్యత

ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్: గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని పెద్దమంగళారం గ్రామ పంచాయతీ పరిధిలోని విజయనగర్ కాలనీలో హెచ్‌ఎండీఏ, ఎస్‌డీఎఫ్, ఎస్‌డీఎఫ్, ఎన్‌ఆర్ఈజీఎస్ నిధులు రూ.30 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు సోమవారం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అందుకోసం గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక నిధులు కేటాయించామన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణానికే ప్రాధాన్యత ఇచ్చి వివిధ రకాల నిధులను మంజూరు చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నరోత్తంరెడ్డి, ఎంపీపీ నక్షత్రం, మాజీ జెడ్పీటీసీ అనంతరెడ్డి, ఎంపీటీసీలు సుమలత, లత, శ్రీనివాస్, ఉపసర్పంచ్ రజిత, ఎంపీడీఓ సంధ్య, ఎంపీఓ వెంకటేశ్వరరెడ్డి, పీఆర్‌డీఈ విజయ్‌కుమార్, ఏఈ గోపాల్, వార్డు సభ్యులు ప్రవీణ్‌గౌడ్, లావణ్య, కృష్ణారెడ్డి, రాజుయాదవ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్: సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఐకమత్యంగా పండుగలను జరుపుకోవాలి

మొయినాబాద్‌రూరల్: పండుగలను ఐకమత్యంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మహిళా అధ్యక్షురాలు దారెడ్డి శోభ అన్నారు. మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామంలో సర్పంచ్ శోభ మైనార్టీ సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొని మైనార్టీ సోదరులతో కలిసి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ముస్లింలు వీరిని ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా అందరు పండుగల్లో పాల్గొని ఉత్సాహంగా జరుపుకోవాలన్నారు. శోభ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు ముదిగొండ శ్రీహరియాదవ్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాహుఫ్, మాజీ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మండల బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు జీవంతు, నాయకులు యూసుఫ్, జహంగీర్, సురేందర్‌గౌడ్, షరీఫ్, ఖాదర్, మౌలానా, సత్తర్, నజీర్, సప్తగిరి, పరమేశ్, శివారెడ్డి, నాజర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయండి

ప్రభుత్వ రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ తాలుకా అధ్యక్షుడు రామారావు

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వ రిటైర్డ్ పెన్షనర్స్‌కు పెన్షన్ చెల్లింపులో సీపీఎస్ కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వ రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ తాలుకా అధ్యక్షుడు రామారావు డిమాండ్ చేశారు. ప్రభుత్వ రిటైర్డ్ పెన్షనర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం రిటైర్డ్ పెన్షనర్స్ యూనియన్ నాయకులు జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ...ప్రతినెల 1న పెన్షనర్స్‌కు పెన్షన్ డబ్బులు ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే ప్రకటించి నగదు రూపంలో చెల్లించాలని చెప్పారు. రాష్ట్రంలోని విశ్రాంత ఉద్యోగులందరికి అన్ని కార్పొరేట్ ప్రైవేట్ ఆసుపత్రులలో నగదు రహిత నాణ్యమైన వైద్య సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. పెన్షన్ కమిటేషన్ వ్యవధిని 15 సంవత్సరాల నుంచి 12 సంవత్సరాలకు కుదించాలని అన్నారు. స్పెషల్ టీచర్లకు వెంటనే నేషనల్ ఇంక్రిమెంట్లు ప్రకటించాలని కోరారు. పెన్షనర్స్‌కు ఆదాయ పన్ను మినహాయింపు ఇవ్వాలని, రైలు ప్రయాణంలో రాయితీలు కల్పించాలని అన్నారు. ధర్నాకు తరలిన వారిలో ప్రభుత్వ రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా సహాయ కార్యదర్శి దుగ్గశేఖర్, తాలుకా ప్రధాన కార్యదర్శి జనార్దన్, ట్రెజరర్ పాండు, నాయకులు జగదీశ్వర్, సత్యనారాయణగౌడ్, నాగేష్, శంకర్, వెంకటరమణ, గిరిజ, మోహనప్ప, కాశన్న పాల్గొన్నారు.



ధర్నాకు వెళ్తున్న రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

ప్రాథమిక చికిత్సగా సీపీఆర్ చేయాలి



చేవెళ్ల: సీపీఆర్‌పై శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ దామోదర్

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్, ఎంపీపీ విజయలక్ష్మి

చేవెళ్ల: అకస్మాత్తుగా ఎవరికైనా గుండెపోటు వచ్చినట్లు గుర్తిస్తే వెంటనే అందుబాటులో ఉండే వైద్యసిబ్బంది వారికి ప్రాథమిక చికిత్సగా సీపీఆర్ చేసే విధంగా ప్రతి ఒక్కరు అవగాహన కల్గి ఉండాలని చేవెళ్ల డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్, ఎంపీపీ విజయలక్ష్మిలు అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మండలంలోని ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, ప్రభుత్వ కార్యాలయ సిబ్బందికి సీపీఆర్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్లు ప్రసాద్, రఘుబాబు, గోపాల్‌రెడ్డి తదితరులు హాజరై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుండెపోటుకు గురైతే వెంటనే స్పందించి వారికి ప్రాథమిక చికిత్స చేసి అంబులెన్స్ ద్వారా పెద్ద ఆస్పత్రికి తరలించే ఏర్పాటు చేయాలన్నారు. దీంతో గుండెపోటుతో అకస్మాత్తుగా చనిపోతున్న వారి సంఖ్యను తగ్గించేందుకు వీలు అవుతుందన్నారు. ప్రభుత్వం దీనిపై అందరికి అవగాహన ఉండాలని ప్రతి ఒక్కరికి ప్రాథమిక చికిత్సలు, సీపీఆర్ ఎలా చేయాలనే దానిపై శిక్షణ ఇస్తుందని చెప్పారు. విదేశాల్లో ఇలాంటి రోగులకు సీపీఆర్ చేయడం వల్ల నూటికి 70శాతం మరణాలు తగ్గుతున్నాయన్నారు. మన రాష్ట్రంలో కూడా దాదాపుగా అందరూ శిక్షణ పొందితే భవిష్యత్తులో గుండెపోటు వచ్చినప్పడు ప్రథమ చికిత్స అందిస్తే గుండెపోటు మరణాలు తగ్గుతాయని చెప్పారు. కార్యక్రమంలో మండలంలోని ఆశవర్కర్లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరాలతో లబ్ధి



వైద్య శిబిరం నిర్వహిస్తున్న డాక్టర్లు

సర్పంచ్ భానూరు మమత, ఎంపీటీసీ కరుణాకర్

షాబాద్: పేద ప్రజలు ఉచిత హోమియోపతి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కక్కులూర్ గ్రామ సర్పంచ్ భానూరు మమత, ఎంపీటీసీ కరుణాకర్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని కక్కులూర్ గ్రామంలో ముచ్చింతల్ జిమ్స్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రపంచ హోమియోపతి దినోత్సవం (డాక్టర్ హనీమన్స్ జయంతి) సందర్భంగా ఉచిత హోమియోపతి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డాక్టర్ పూనమ్ మాట్లాడుతూ.. జిమ్స్ డాక్టర్ల బృందం నెలలో రెండు సార్లు కక్కులూర్ గ్రామంలో హోమియోపతిపై అవగాహన కార్యక్రమాలతో పాటు ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించి మందులను పంపిణీ చేశామన్నారు. సుమారు వంద మందికి రోగులను పరిశీలించి కీళ్ల నొప్పులు, మధుమేహం, ఉబ్బసం, గొంతు, ఎముకల సమస్యలు, కిడ్నీ సమస్యలు, స్త్రీ సంబంధిత సమస్యలకు ఉచిత మందులను పంపిణీ చేసినట్లు చెప్పారు. సర్పంచ్ మమత మాట్లాడుతూ...ఉచిత వైద్య శిబిరాలు పేదలకు దేవుడిచ్చిన వరమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను పేదలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కరుణాకర్, మాజీ ఎంపీటీసీ జీవన్‌రెడ్డి, జిమ్స్ డాక్టర్ల బృందం, జిమ్స్ విద్యార్థినులు, విద్యార్థులు తదితరులున్నారు.

కాంగ్రెస్‌కు అధికారం ఖాయం

పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఆలుగడ్డ ప్రవీణ్‌యాదవ్

షాద్‌నగర్: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఆలుగడ్డ ప్రవీణ్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని అన్నారం, రాయికల్, రామేశ్వర్, విఠ్యాల, కంసాన్‌పల్లి, చించోడ్, కిషన్‌నగర్ గ్రామాల్లో హాత్ సే హాత్ జోడో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రవీణ్ యాదవ్ మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పూర్తిగా గాలికి వదిలేశాయన్నారు. రోజు రోజుకు నిత్యావసర సరుకులు, ఇంధనం ధరలు పెరుగుతున్నాయని వాపోయారు. ధరలను అదుపు చేయడంలో ప్రభుత్వాలు విఫలం చెందాయని చెప్పారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా అభివృద్ధి సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు చేపట్టాల్సిన ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యమవుతామని అన్నారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే హాత్‌సే హాత్ జోడో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించి అఖండ విజయాన్ని అందించాలన్నారు. ఈ సందర్భంగా రామేశ్వరంలోని దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిల్ పుష్పమ్మ, ఇందిర, చంద్రకళ, వెంకటయ్యగౌడ్, శ్రీకాంత్‌గౌడ్, నవీన్, అంజయ్య, మల్లేష్, శంకర్, ఫెరోజ్, పాల్గొన్నారు.



జోడో పాదయాత్రలో పాల్గొన్న ప్రవీణ్‌యాదవ్, నాయకులు

సమస్యల పరిష్కారానికి కృషి

షాహెదా బేగం

దోమ: ప్రజావాణిలోని ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ షాహెదా బేగం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతుల నుంచి నాలుగు ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

కిష్టాపూర్‌లోని సర్వే నెంబర్ 198లో ప్రభుత్వ భూమిని కొందరు గ్రామస్తులు కబ్జాకు చేస్తున్నారని సర్పంచ్ సత్యమ్మ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అట్టి వ్యక్తులపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. అనసుజ, గ్రామస్తులు వెంకటేశ్‌గౌడ్, నర్సింహులు పాల్గొన్నారు.

నందిగామలో కాంగ్రెస్ జెండాను ఎగరేస్తాం

ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ



మాట్లాడుతున్న ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ

నందిగామ: కాంగ్రెస్ నుంచి కేవలం ఇద్దరిని బీఆర్ఎస్‌లో చేర్చుకొని 200 మందిని చేర్చుకున్నట్లు బీఆర్ఎస్ నేతలు గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు, స్థానిక ఎంపీటీసీ కొమ్ము కృష్ణ విమర్శించారు. నందిగామలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరినట్లుగా ఆ పార్టీ నాయకులు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నందిగామలో ఏం అభివృద్ధి చేశారని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలిచే సత్తాలేని నాయకులు గ్రామస్తులను ఇబ్బందిపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అంతిరెడ్డిగూడను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని హైకోర్టు తీర్పు ఇస్తే సుప్రీం కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారని ఆరోపించారు. నందిగామ గ్రామ పంచాయతీ ఎన్నికలలో గెలవలేమని తెలిసి, నందిగామను మున్సిపాలిటీగా ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికలలో ఎదో ఒక చోట కౌన్సిలర్‌గా గెలిచి అక్రమంగా చైర్మన్ కావచ్చని పగటి కలలుకంటున్నారని, వారికి వచ్చే ఎన్నికలలో తగిన బుద్ధి చెప్పి నందిగామలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగరేస్తామని ఆయన దీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహాయాదవ్, ఎంపీటీసీలు దేపల్లి కుమార్ గౌడ్, చంద్రపాల్ రెడ్డి, నందిగామ పీఏసీఎస్ వైస్ చైర్మన్ జంగ రజినీ కాంత్, ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'పల్లె పల్లెకు పైలట్'

పెద్దేముల్: మండల పరిధిలో ఈ నెల 11 నుంచి 15 వరకు పల్లె పల్లెకు పైలట్ రోహిత్‌రెడ్డి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ అనురాధ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సాగు పద్ధతులపై రైతులకు అవగాహన

చేవెళ్ల: యాసంగిలో రైతులు సాగు చేసే వరిసాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు పొందాలని మండల వ్యవసాయాధికారి తులసి అన్నారు. మండలంలోని రేగడిఘనాపూర్ గ్రామంలో సోమవారం సర్పంచ్ నర్సింలు ఆధ్వర్యంలో క్షేత్రదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పొలాల వద్ద రైతులకు అవగాహన కల్పించారు. యాసంగి సీజన్‌లో రైతులకు సాగుపద్ధతుల్లో ట్రైకోడర్మా విరిడె వినియోగ,ం పీఎస్‌బీ వినియోగం, వరిలో వెదజల్లే పద్ధతి, దఫాలుగా ఎరువుల వినియోగం మొదలైన వాటిపై అవగాహన కల్పించారు. రైతులు సరైన పద్ధతులను పాటించి సాగు చేస్తే మంచి దిగుబడులు సాధిస్తారని చెప్పారు. ట్రైకోడర్మా విరిడె వల్ల నేలలోని సారాన్ని పెంచి మొక్కలకు తెగుళ్లు రాకుండా నివారిస్తోందని చెప్పారు. పీఎస్‌బీ (ఫాస్పరస్ సాలుబులైజింగ్ బాక్టీరియా)వినియోగం వల్ల నెలలో ఉన్న ఫాస్పరస్ మొక్క తేలికగా తీసుకొనే రూపంలోకి మర్చుతుందన్నారు. దీని వల్ల హెక్టారుకు ఒక బస్తా ఖర్చు ఆదా అవుతుందని చెప్పారు. వరిలో వెదజల్లే పద్ధతి వల్ల నేరుగా విత్తుకునే వరి మన నాటు ఖర్చు ఉండదని చెప్పారు. పంట కాలం 10రోజులు తగ్గుతుందని చెప్పారు. ఎకరానికి 8వేల వరకు ఖర్చు ఆదా అవుతుందని చెప్పారు. దఫాలుగా ఎరువుల వినియోగం వల్ల ఒకేసారి కాకుండా దఫాలుగా వేసుకోవడం వల్ల పంటకు బాగా ఎరువులు అందుతాయని చెప్పారు. అధిక దిగుబడులకు అవకాశం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు బర్కల రాంరెడ్డి, వ్యవసాయ విస్తారణ అధికారులు బాలక్రిష్ణ, రమేశ్, వరుణ్, రాజేశ్వర్‌రెడ్డి, స్వాతి, గ్రామరైతులు పాల్గొన్నారు.



క్షేత్ర దినోత్సవంలో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

'ఇంటింటికి సీపీఐ'ను విజయవంతం చేయండి



మొయినాబాద్‌లో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

సీపీఐ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభులింగం

మొయినాబాద్: బీజేపీకో హఠావో.. దేశ్‌కో బచావో నినాదంతో చేపడుతున్న ఇంటింటికి సీపీఐ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ప్రభులింగం అన్నారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఇంటింటికి సీపీఐ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ప్రమాదకర ఫాసిస్టు నిరంకుశ హిట్లర్ తరహా పాలన కొనసాగిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని 2024 ఎన్నికల్లో ఓడించాలని.. వామపక్ష ప్రగతిశీల, లౌకిక, ప్రజాస్వామ్య శక్తులతో కూడిన ప్రభుత్వం అధికారంలోకి వచ్చే విధంగా ప్రజలను చైతన్యం చేసేందుకు ప్రజాపోరు యాత్రలను చేపడుతున్నామన్నారు. అందులో భాగంగానే మోదీ ప్రభుత్వ మోసాలు, వైఫల్యాలను ప్రజల వద్దకు తీసుకెళ్లేందుకు ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుధాకర్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు సుభాన్‌రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, సీపీఐ మండల కార్యదర్శి కె.శ్రీనివాస్, నాయకులు జాంగీర్, సత్తిరెడ్డి, మక్బుల్, అంజయ్య, శివ, సత్తయ్యగౌడ్, శివయ్య, శ్యాంసుందర్, నరేందర్, వెంకటయ్య, జలీల్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హామీల అమలుకు పోరాటం

వైఎస్సార్ టీపీ నాయకుడు మహ్మద్ ఇబ్రహీం

షాద్‌నగర్: ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, హామీల అమలుకు పార్టీలకు అతీతంగా పోరాటాలకు సిద్ధమని వైఎస్సార్ తెలంగాణ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ మహ్మద్ ఇబ్రహీం అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎంతో మంది విద్యార్థులు ఉన్నత విద్యలు అభ్యసించి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగాల భర్తీ కోసం ప్రభుత్వం నిర్వహించిన టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ కారణంగా పరీక్షలు రాసిన ఎంతో మంది విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారని వాపోయారు. ఉద్యోగాల సాధనకు ఎంతో మంది విద్యార్థులు శ్రమించి, శిక్షణ కోసం డబ్బులు ఖర్చు చేసి పరీక్షలు రాశారని అన్నారు. దీంతో నిరుద్యోగులు అవస్థలు పడుతున్నారని చెప్పారు. సమావేశంలో శ్రీను, నర్సింహ్మ పాల్గొన్నారు.

అరెస్టులు చేస్తే చూస్తూ ఊరుకోం

కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్

షాబాద్: కాంగ్రెస్ పార్టీ నాయకులను ముందస్తు అరెస్టులు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని షాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను సోమవారం తెల్లవారు జామున ముందస్తు అరెస్టులు ఎందుకు చేశారో చెప్పాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నుంచి ఎలాంటి పిలుపు లేకున్నా షాబాద్ పోలీసులు తమకు ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రమం ఉందని చెప్పి తమకు ఆదేశాలు లేకున్నా ముందస్తుగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అందరిని అరెస్టు చేయడంపై మండిపడ్డారు. తమను దొంగలను పట్టుకొచ్చినట్లు రాత్రిపూట, తెల్లవారు జామున అరెస్టులు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమలో ఎంపీటీసీ కుమ్మరి చెన్న య్య, గుండాల అశోక్, మల్లేష్, గౌరీశ్వ ర్, మల్లేష్, మహ్మద్ కుద్దూస్, శేఖర్, శ్రీనివాస్, ఆంజనేయులు, సాయిరెడ్డి, బాలరాజ్ తదితరులున్నారు.



షాబాద్: కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

చేవెళ్ల: అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్ అన్నారు. సోమవారం పోలీసులు యువజన కాంగ్రెస్ నాయకులను ముందస్తుగా అరెస్టులు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవ తరగతి పేపర్ లీకేజీ కారణంగా యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, రాష్ట్ర ఇన్‌చార్జి సురభిజీ, రమేశ్‌బాబులు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల ముట్టడికి పిలుపు నివ్వడంతో పోలీసులను అడ్డుకొనేందుకు ముందస్తు అరెస్టులు చేసినట్లు తెలిపారు. అరెస్ట్ చేసిన వారిలో యువజన కాంగ్రెస్ నాయకులు సుశాంత్, మాధవ్, యాదగిరి, ప్రవీణ్, రేవంత్‌రెడ్డి ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్టు

మొయినాబాద్: ఇటీవల జరిగిన పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా టీపీసీసీ సోమవారం ధర్నాకు పిలుపు నివ్వడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. పోలీసులు కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య, ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గం అధ్యక్షుడు మధు, యువజన కాంగ్రెస్ నాయకులు రాజేందర్‌గౌడ్, రాజుగౌడ్, భిక్షపతి ముదిరాజ్, వెంకటేష్ రాజేందర్‌లను ముందస్తుగా అరెస్టు చేసి మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వరకు పోలీస్‌స్టేషన్‌లో ఉంచి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.